క్లుప్తంగా

కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి



జల్లికొమ్మరలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

గణపవరం: ఉద్యోగులను, నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి శాసన మండలి ఎన్నికలలో గుణపాఠం చెప్పాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం వారు గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో శాసన మండలి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీనియర్ నాయకులు కవల సత్యనారాయణ, ఎం.పెంటారావు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని సైకిల్ యాత్ర



దుగ్గిరాలలో సైకిల్ యాత్ర చేస్తున్న బి.శంకర్

పెదవేగి : మేము ఏజెన్సీకి చెందిన ముంపు ప్రాంత వాసులమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఓ యువకుడు రాష్ట్రమంతా సైకిల్ యాత్ర ప్రారంభించాడు. శుక్రవారం పెదవేగి మండలం దుగ్గిరాల జాతీయ రహదారిలో ఆయన ప్రయాణించాడు. ఈ సందర్భంగా బీరబోయిన శంకర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చినట్టు తెలిపారు. పోలవరం గోదావరి వరద ప్రభావిత ప్రజలమని, 30 ఏళ్లు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతూ రాష్ట్రమంతా సైకిల్ యాత్ర ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికి సుమారు 2,500 కిలోమీటర్ల సైకిల్ యాత్ర పూర్తి చేసినట్టు శంకర్ చెప్పారు.

హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలి



పాతూరు గోడౌన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

భీమడోలు: సివిల్ సప్లై హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచుతూ ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేటికీ జీవో జారీ చేయలేదని శుక్రవారం హమాలీలు సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు గోడౌన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మంత్రి నాదెండ్ల మనోహర్ యూనియన్‌తో చర్చలు జరిపి మూడు నెలలు కావస్తున్నా నేటికి కూలి రేట్లు పెంచుతూ ఎటువంటి జారీ చేయలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు త్రిమూర్తులు, కార్యదర్శి దుర్గారావు మాట్లాడుతూ 2024 జనవరి నుంచి పెరిగిన రేట్లు అమలుల్లోకి రావాల్సి ఉండగా నేటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా కాళీవర ప్రసాద బాబూజీ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాన్ని ప్రతిష్ఠించిన నంబూరు కాళీవనాశ్రమం పీఠాధిపతులు చంద్రకాళీ ప్రసాద మాతాజీ

భీమడోలు: గుండుగొలనులోని కాళీవనశ్రమం ప్రాంగణంలోని శుక్రవారం హనుమత్ కాళీవర ప్రసాద బాబూజీ శిలా విగ్రహాన్ని గుంటూరు జిల్లా నంబూరు కాళీవనాశ్రమం పీఠాధిపతులు యోగిని శ్రీచంద్రకాళీ ప్రసాద్ మాతాజీ చేతుల మీదుగా ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. తొలుత అభిషేకాలు, హోమం, పూజలు ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని పూజలు చేసారు. భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వనాశ్రమం నిర్వాహకులు కుమారస్వామిరాజు, కొండ గంగారాజ్‌కుమార్, రామబ్రహ్మం, రామకృష్ణ, చీమల చిన్నారావు, భక్తులు పాల్గొన్నారు.

హాస్టల్ ఆధునీకరణకు కృషి

దెందులూరు: కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో రూ.16.25 లక్షలతో ఆధునీకరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్‌డబ్ల్యూ రమేష్ అన్నారు. శుక్రవారం ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో చేపట్టిన ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఏవో సత్యనారాయణకు సూచించారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నారు.

కౌలు రైతుల పాలిట శాపంగా భూధార్

- భవిష్యత్తులో పథకాల లబ్ధి, రుణాలన్నీ భూయాజమానులకే
- ఇకపై నామమాత్రంగా అందనున్న పథకాల లబ్ధి
- కౌలుదారుల గుర్తింపునకు గండి



భీమడోలులో భూధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



సూరప్పగూడెంలో పంట నమోదు చేస్తున్న దృశ్యం

భీమడోలు: భూ యాజమానులలిచ్చే భూధార్‌తో కౌలు రైతులు పాలిట శాపంగా మారనుంది. దీనితో కౌలు రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు వాస్తవ సాగుదార్ల సంక్షేమం కోసం రాష్ట్రం చేసిన చట్టాలు నిర్వీర్యమవుతాయన్న అనుమానం కౌలుదారుల్లో నెలకొంది. ఈ చట్టాల వల్ల నామమాత్రంగా దక్కుతున్న గుర్తింపును ఈ భూధార్ కార్డులు మరింత గండి కొట్టనున్నాయి.

కౌలు రైతు సంఘాల గగ్గోలు

సొంత భూమి గల భూ యాజమానులకు 11 అంకెల గల విశిష్ట సంఖ్యను భూధార్ కార్డులను జారీ చేయాలని కేంద్రం ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై అమలు చేసింది. ఈ కార్డులను పీఎం కిసాన్, ఫసల్ బీమా వంటి ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల వంటి పరపతి సౌకర్యాలకు భూధార్‌ను తప్పనిసరంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అయితే కౌలు రైతుల గుర్తింపు, పంట రుణాల సమస్య మొదటికి రానుంది. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ చట్టాలు, పద్ధతుల ద్వారా అరకొరగా బ్యాంకు రుణాలు అందుతున్నాయి. ఈ చట్టాలను మరింత సరళతరం చేసి ఇతోధికంగా బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతులు ఆందోళన చేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం భూధార్ వల్ల కౌలు రైతులు తీరని నష్టాన్ని తెచ్చి పెడతాయని కౌలు రైతు సంఘాలు గగ్గోలు పెడుతున్నారు. భవిష్యత్తులో భూధార్ కలిగిన రైతులకు పంట రుణాలు, పీఎం కిసాన్, బీమా సదుపాయాలు పేర్కొనడంతో రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలతో జారీ చేసిన కౌలు రైతుదారుల గుర్తింపు కార్డుల చెల్లుబాటు ప్రశ్నార్థకంగా మారనుందని వాపోతున్నారు.

మండలం	సాగు విస్తీర్ణం	రైతులు
భీమడోలు	12,750	4,390
ఉంగుటూరు	24,350	10,500
నిడమర్రు	3,466	1,031
గణపవరం	11,750	4,300

భూధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలు

భవిష్యత్తులో భూధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలిస్తారని రిజర్వ్‌బ్యాంకు బ్యాంకులకు ఆదేశిలిచ్చింది. గతంలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు చట్టం మేరకు ఇచ్చిన కౌలు రైతు కార్డులకు అరకొరగా రుణాలిచ్చే బ్యాంకులు ఆర్‌బీఐ ఆదేశాలతో వారికి రుణాలు అందని ద్రాక్షగా మారనున్నాయి. కూటమి సర్కార్ కౌలు రైతులుకు మేలు చేసేలా చట్టం తీసుకుని వస్తానని పేర్కొంది. ఆ చట్టం కోసం కౌలు రైతులు ఎదురు చేస్తున్నారు.

హడావుడిగా విశిష్ట సంఖ్య నమోదుకు చర్యలు

కేంద్ర ప్రభుత్వం ఈనెల 24న పీఎం కిసాన్ మూడో విడత నిధులు విడుదల చేయనున్న నేపథ్యంలో భూయాజమానికి విశిష్ట సంఖ్య జారీ చేయాలని ఆదేశించడంతో వ్యవసాయశాఖ ఆగమేఘాలపై చర్యలు చేపట్టింది. రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ వద్దకు భూయాజమాని తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డుకు అనుంధానం చేసిన మొబైల్ నంబర్ తీసుకుని వెళ్లాయి. వారు మీ భూమి పోర్టల్, ఆర్ఎస్ఆర్, పట్టాదారు పాసు పుస్తకాల ఆధారంగా పార్మర్ రిజిస్ట్రీలో ఓనర్‌షిప్‌ను నిర్ధారించి వారికి 11 అంకెల నంబర్‌ను కేటాయిస్తుంది. ఈ నంబర్ కేటాయింపులో సాంకేతిక సమస్యలు తలెత్తితే రెవెన్యూ శాఖ రికార్డులను సరిచూపి వారికి నంబర్‌ను కేటాయిస్తారు. ఆర్ఎస్‌కే వ్యవసాయ శాఖ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో రికార్డులను నమోదు చేసే తరుణంగా 80శాతం చూపితే వెంటనే నంబర్ వస్తుంది. వారు చూపిన పత్రాలు తేడాలున్నట్లయితే 60 నుంచి 80 శాతం వస్తే వీఆర్వో పరిశీలించాలి. 60 శాతం కన్నా తక్కువగా ఉన్నట్లయితే తహసీల్దార్ పరిశీలనకు వెళ్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఆందోళనలు చెందుతున్నారు.

భూధార్‌తో కార్పొరేట్‌కు పంట

కేంద్రం డిజిటల్ అగ్రిమిషన్ పేరుతో రైతుల వివరాలను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించింది. దీనితో వారి వివరాలను కార్పొరేట్ శక్తులకు అందించిన చిన్న, సన్నకారుల రైతులు, కౌలు రైతుల భవిష్యత్తును గొడ్డలి వేటు చేయాలని నిర్ణయించిందని కౌలు రైతు సంఘాల ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కౌలు రైతులకు తీరని నష్టం



వాస్తవంగా 70 నుంచి 80 శాతం మంది కౌలు రైతులే పంట సాగు చేస్తున్నారు. ఈ తరుణంలో భూయాజమానికి విశిష్ట సంఖ్యను జారీ చేస్తున్నారు.రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితుల రీత్యా కౌలు రైతులకు ఏ విధంగా అమలు చేస్తారన్నది స్పష్టత ఇవ్వలేదు. దీనితో కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల డిజిటల్ అగ్రిమిషన్‌ని ఏపీలో అమలు చేసేందుకు శరవేగంతో చేపట్టడం సరైన నిర్ణయం కాదు.

– కె.శ్రీనివాస్, రైతు సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏలూరు

చురుగ్గా విశిష్ట నంబర్ నమోదు



మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 60 నుంచి 70శాతం రైతులకు విశిష్ట నంబర్‌ను జారీ చేసాం. మిగిలిన వారందరికీ ఈనెలాఖరు నాటికి ప్రక్రియను పూర్తి చేస్తాం. రైతులంతా పట్టాదారు పుస్తకం, ఆధార్, మొబైల్ నంబర్‌ను తీసుకుని వచ్చి ఆర్ఎస్‌కే అందించాలి. వెంటనే వారికి విశిష్ట నంబర్‌ను జారీ చేస్తాం. కౌలు రైతులకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల మేరకు చర్యలు చేపట్టడం జరుగుతుంది.

– ఎస్‌పీవీ ఉషారాణి, మండల వ్యవసాయాధికారిణి, భీమడోలు

గ్రామాల్లో ఫీవర్ సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ఇంటింటికీ వచ్చే వైద్య సిబ్బందికి కుటుంబ సభ్యులు సహకరించాలని వివరాలు తెలియజేయాలని పోతునూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో లక్ష్మీపురంతో పాటు ఇతర గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను ఆయన ఎంపీహెచ్ఈఓ హరితో కలిసి పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ నీరు ఉండకుండా ప్రతి ఇంట్లోనూ చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు గృహ సమితి ర్యాలీ

దెందులూరు: ఏలూరు సాల్వేషన్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ గృహ సమితి ఈ నెల 22న ర్యాలీ, సమావేశం నిర్వహించనున్నట్టు దెందులూరు కోర్ ఆఫీసర్ కాకి రమణయ్య, కొవ్వలి కోర్ ఆఫీసర్ మేజర్ సుబ్బారావు అన్నారు. శనివారం దెందులూరు, కొవ్వలి, కంద్రిగ నరసింహాపురం, రామారావుగూడెంతోపాటు జిల్లాలోని అన్ని సాల్వేషన్ ఆర్మీ కోర్ నుంచి మహిళలు గృహ సమితి సభ్యులు ర్యాలీగా ఏలూరు తరలిరావాలని కోరారు. ఏలూరు డివిజనల్ కమాండర్ మోషే దంపతులు ఆధ్వర్యంలో గృహసమితి ర్యాలీ సమావేశానికి చెన్నై నుంచి వచ్చిన లెఫ్టినెంట్ కల్నల్ వైఎస్ కేజియా స్టాలిన్, లెఫ్టినెంట్ సునీల, కెప్టెన్ జ్యోతి సమావేశంలో అతిథి ప్రసంగం చేసి సమావేశం నిర్వహిస్తారన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవనం



మొయ్యేరులో డ్రెయిన్‌లో రసాయనాలు పిచికారీ చేస్తున్న దృశ్యం



గణపవరంలో వైద్య సిబ్బంది ర్యాలీ

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చునని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శుక్రవారం ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని కోరుతూ గణపవరంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వారంలో ఒకరోజు నీటి వాడకం తగ్గించి డ్రైడే పాటిస్తూ దోమల వృద్ధిని అరికట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి

అన్నిరకాల అంటువ్యాధులకు మూలం దోమలేనని దోమలను లార్వా దశలోనే నిర్మూలించడం ద్వారా దోమల వ్యాప్తి అరికట్టవచ్చునని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మొయ్యేరులో సంపూర్ణ పారిశుధ్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధులపై సీహెచ్‌వో జి..వెంకటేశ్వర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని మురుగు డ్రెయిన్లు, పంట కాలువలు, మురుగునీటి కుంటల వద్ద దోమల లార్వాను నిర్మూలించే రసాయనాలను పిచికారీ చేశారు. సర్పంచ్ దుళ్ల కుటుంబరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పోటీతత్వంతోనే విజయం సాధ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దెందులూరు: పోటీతత్వం నిరంతర సాధనతోనే విజయం సాధ్యపడుతుందని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీఎస్ఎల్ఎన్‌వీ శర్మ అన్నారు. దెందులూరు నియోజకవర్గం గ్రిక్స్ స్పోర్ట్స్ మరియు గేమ్స్ కొవ్వలి జెడ్పీ హైస్కూల్లో ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు జక్కుల సురేష్‌కుమార్, గవ్వ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సుమారు 20 పాఠశాల నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దీనిలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ పోటీల్లో వివిధ పాఠశాల నుంచి సుమారు 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గం పోటీలో విజేతలకు బహుమతులను రామశింగవరం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జమ్మ రామకృష్ణ ఆర్థిక సహకారం అందజేశారు. దాత ఫిజికల్ డైరెక్టర్ జమ్మ రామకృష్ణను పాఠశాల హెచ్‌ఎం శర్మ, ఫిజికల్ డైరెక్టర్లు సురేష్ కుమార్, శ్రీనివాసరావు నియోజకవర్గంలోని పీడీ అభినందించారు.

సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



ప్రచారం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఏలూరు (టూటౌన్): నగరపాలక, పురపాలక, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని ఎస్ఆర్–2 వద్ద మస్టర్ టైంలో శుక్రవారం ప్రచారం చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్‌కాస్ సంస్థను రద్దు చేసి ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిరిగి ప్రైవేటు వ్యక్తులను కాంట్రాక్టులుగా నియమించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 24న ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, సహాయ కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, నాయకులు నారా శ్రీను, ఎస్ సింహాచలం, కందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



లీడ్ బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని కౌలు రైతులందరికీ పంట రుణాలిచ్చి ఆదుకోవాలని ఏపీ కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంపా కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ఆర్ కాలేజీ వద్ద ఉన్న జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. లీడ్ బ్యాంకు మేనేజర్ సీలాద్రికి వినతిపత్రం అందజేశారు. గుర్తింపు కార్డులు, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ బ్యాంకు పంట రుణాలు ఇవ్వకుండా కౌలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని వివరించారు. ఏపీ పంట సాగుదారు హక్కుల చట్టం–2019 ప్రకారం గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులందరికీ హామీ లేకుండానే పంట రుణాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ బ్యాంకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గన్నుని వెంకట్రావు, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, నాయకులు నాగం అచ్యుత్, కె.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



భీమడోలు: పాతూరు పాఠశాలలో తెలుగు తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం పి.నిర్మలకుమారి, మండే సుధాకర్



దెందులూరు: సీతంపేట పాఠశాలలో వివిధ వేషధారణలో చిన్నారులు



నారాయణపురం ఎస్ఏఎస్ డిగ్రీ కళాశాలలో చిట్టిబాబును సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సీతంపేట పాఠశాలలో హెచ్‌ఎం సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తోట ఎడ్వర్డ్, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష విశిష్టత ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాష ఉపాధ్యాయులు మాసగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చింతలపూడి డిగ్రీ కాలేజీ తెలుగు అధ్యాపకులు ముంగా జయరాజు, విశిష్ట అతిథిగా విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు గ్రంధి ప్రభాకర్ హాజరయ్యారు. నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్బిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం వేడుకలు నిర్వహించారు.

సాధనతో బాషపై పట్టు సాధించాలి

పెదపాడు: సాధనతో బాషపై పట్టు సాధించాలని పెదపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరావు తెలిపారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు విశిష్టమైనవి

భీమడోలు: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు విశిష్టమైనవని పలువురు వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భీమడోలు, పాతూరు, పోలసానిపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో తెలుగు భాష గొప్పదనంపై నృత్యరూపకం, పద్యాల పోటీలు నిర్వహించారు. విజయనగదరం సామ్రాజ్యంలో అష్టదిగ్గజ కవులతో శ్రీకృష్ణ దేవరాయుల వేషధారణలో 8వ తరగతి విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, ప్రముఖ న్యాయవాది పూడి సంపదరావు పాల్గొన్నారు. పాతూరు ప్రాథమిక పాఠశాలలో భారత మాత చిత్రపటం వద్ద హెచ్‌ఎం పి.నిర్మలకుమారి, విద్యార్థులు నివాళులర్పించారు. పోలసానిపల్లి పాఠశాలలో హెచ్‌ఎం కె.తులసి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఉంగుటూరు: విజ్ఞానార్జనకు అనుకూలమైన అద్భుతమైన లక్షణాలు కలిగిన భాష తెలుగు భాష అని భీమవరం డీఎన్ఆర్ కళాశాల తెలుగు, సంస్కృతి విభాగం అధ్యక్షుడు టి.చిట్టిబాబు అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సమన్వయ కర్తగా డా. కొండారవి వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ రెడ్డయ్య, అధ్యాపకులు శ్రీమతి నిర్మల జ్యోతి, మణీంద్ర రావు, లావణ్య, శ్రీఆమోహనరావు, రఘునాథ్, లైబ్రేరియన్ గాబ్రియేలు పాల్గొన్నారు.

చేబ్రోలులో ప్రత్యేక వైద్యశిబిరం



చేబ్రోలు శిబిరంలో సేవలందిస్తున్న డా.వర్మ

ఉంగుటూరు: చేబ్రోలుకు చెందిన 30 ఏళ్ల వివాహిత యువతికి గులియన్ బ్యారీ సింద్రోమ్ (జీబీఎస్) వ్యాధి రావడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. విజయవాడలో ఆమె చికిత్స పొందుతోందని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. పీహెచ్‌సీ డా.వర్మ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మెడికల్ సిబ్బంది ఇంటింకీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు.

ఆటో స్టాండ్ తొలగింపు అన్యాయం

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ ఎదుట ఉన్న ఆటోస్టాండ్‌ను తొలగింపును నిరసిస్తూ ఆటో కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్పొరేషన్ వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ ఆటో స్టాండ్ తొలగింపుతో 300 మంది డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. ఏలూరు నగరంలో పరిశ్రమలు మూతపడినా నోరు మెదపని పాలకులు స్మార్ట్ సిటీ పేరుతో ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టేందుకు సిద్ధకావడం దారుణమన్నారు. కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమరకుమార్, జె.గోపి తెలిపారు. వైఎస్ కనకరావు, ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ రాజారావు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



ఉంగుటూరులో మాట్లాడుతున్న డీపీవో కె.అనురాధ

ఉంగుటూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డీపీవో కె.అనురాధ అన్నారు. శుక్రవారం ఉంగుటూరు ఎస్‌డబ్ల్యూఎం షెడ్డులో నిడమర్రు, ఉంగుటూరు మండలాల పారిశుధ్య కార్మికులకు, సచివాలయాల ఉద్యోగులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనురాధ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ ఎలా చేయాలో వివరించారు. తడి చెత్తను, పొడి చెత్తను ప్రజలు వేరుచేసేలా చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని సూచించారు. ఎంపీడీవో రాజ్‌మనోజు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు, సచివాలయ ఉద్యోగులు ఈ విషయంలో శ్రద్ధచూపాలని అన్నారు. ట్రైనింగ్ మేనేజరు ప్రసంగిరాజు, ఈవోపీఆర్డీలు శ్రీనివాస్, తిరుపతి స్వామి మాట్లాడారు. కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు మార్చి 24, 25 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు దేశ వ్యాప్తంగా సమ్మె చేయనున్నట్టు యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ కాళే శ్రీనివాసరావు తెలిపారు. సమ్మె నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఎన్ఆర్‌పేటలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, వారంలో ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను నిలుపుదల చేయాలని, ఐబీఏతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం మిగిలిన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వలే గ్రాట్యుటీ రూ.25 లక్షలు పెంచి ఇన్‌కంటాక్స్‌లో రాయితీ ఇవ్వాలన్నారు. బ్యాంకులను దాడుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు శ్రీనివాసమోహన్, ఎన్ లక్ష్మణరావు, ఏఐబీఓసీ నాయకులు శ్రీనివాస్, ఎన్‌సీబీఈ నాయకులు రత్నవిమల్, రిటైర్డ్ యూనియన్ నాయకులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన పౌల్ట్రీ రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో శుక్రవారం ఆయన పౌల్ట్రీ రైతుల సమస్యలపై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణం నష్ట పరిహారం ఇచ్చి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.